# కాంతం తెచ్చిన కలవరం

వి. యస్. రాయుడు

కథానిక

వీధి గుమ్మంలో నుంచుని పోస్టుమాన్ కోసం ఎదురు చూస్తోంది కాంతం. ఉదయం పదిన్నర కావస్తూంది. రోజూ పదిగంటలకే వచ్చేవాడు. ఇంకా రాలేదామా అని ఇంకోసారి గుమ్మంలోకి వచ్చి అటూ, ఇటూ చూసి లోపలికెళ్ళి పోయింది కాంతం. ఆమెకు రోజూ అదొక అలవాటయి పోయింది. పోస్టుమాన్‌కి కూడా కాంతానికి వర్రి చెయ్యి చూపించటం పరిపాటయి పోయింది...,

కాంతానికి చిన్నతనంలోనే వివాహమయింది. అప్పటికి, ఆమె భర్త మూర్తికి కూడా చిన్న వయస్సే. పెండ్లినాటికి మూర్తి హైస్కూల్లో నాలుగోఫారం చదువుతూండేవాడు. కాంతం, సుబ్బయ్యపంతులు బడిలో చదువుతూండేది. వాళ్ళిద్దరిపెళ్ళి బొమ్మలపెళ్ళిగానే జరిగింది. తరువాత కాంతం వయస్సు ఆమె చదువుకి థర్డు ఫారందగ్గిర ఫుల్‌స్టాప్ పెట్టింది. మూర్తి వాల్తేరులో బి. కాం., ప్యాసయి బొంబాయి, ఏ. డి., ఆఫీసులో ఖాళీలున్నాయని తెలిస్తే ఉద్యోగానికి దర్ఖాస్తు పడేశాడు. అతని అదృష్టమనే చెప్పాలి ఉద్యోగం కూడా వెంటనే అయింది. అసలు మూర్తి మనస్తత్వమే వేరు. తనకు పెండ్లి అయిందని, భార్య ఉందనీ ఇట్లాంటి ఆలోచనల్లేవు. 'హాపీ గో లక్కీ ఫెలో' అంటారు మిత్రులతన్ని. తండ్రి ప్లీడరీ వృత్తి మూర్తిని మరింత స్వతంత్ర జీవిగా తయారు చేసింది. ప్లీడరుగారికి, అంతచిన్నతనంలో మూర్తికి వివాహం చేయటానికి ఇష్టలేక పోయినా, భార్య పట్టుదలపై మేనరికానికి ఒప్పుకోవల్సి వచ్చింది. కోర్టులో ఎంత ఘనంగా వాదించినా ప్లీడరుగారికి ఇంట్లో వాయిన్‌లేదు. భార్య కామాక్షమ్మ ఎంత చెప్తే అంత.

“అయిన సంబంధం! దగ్గరవాళ్లు అసలు వాళ్ళిద్దరికీ పుట్టక మునుపే నిర్ణయమయింది...!...” ఇదీ కామాక్షమ్మగారి మనస్తత్వం. బొంబాయిలో కొడుక్కు ఉద్యోగమంటే ఆ మాతృహృదయం ఒప్పుకోలేదు. కానీ, ప్లీడరుగారి ఉద్దేశాలు వేరు. ఇప్పటినుంచే దేశంకాని దేశంలో బ్రతకడం అలవర్చుకోవాలంటారుఆయన బొంబాయిలో ఉద్యోగమనగానే మిత్రులంతా తెగపొగిడేసి మూర్తిచేత ఘనంగా బిల్లుచెల్లింప చేశారు ఉడిపీ హోటల్లో. తల్లికిష్టం లేకపోయినా స్వతంత్ర భావాలుగల మూర్తి బొంబాయికి రైలెక్కాడు.

కాంతానికి, ఇన్నాళ్ళుగా మూర్తిగురించి యే ఆలోచనాలేదు కాని మూర్తి ఉద్యోగమయి బొంబాయి వెళ్తున్నాడనగానే ఆమెలోని భావాలు సముద్రతరంగాల్లా ఉవ్వెత్తున లేచాయి. కాని ఆమె అంతులేని భావపరంపరలకు హాల్లో కేక వేస్తున్న నాన్నగారి కంచుగొంతుక అంతరాయం కల్గించింది. ఆరోజున, మూర్తి ప్రయాణమయి బొంబాయి వెళ్తున్ననాడు!..., సుందరామయ్యగారు, కాంతం నాన్నగారు, కోపంతో చిందులు త్రొక్కుతున్నారు. మూర్తి ఉద్యోగమయ్యాక మంచీ, చెడ్డా మాట్లాడ్డానికి అత్తగారింటికి రాకండా, కనీసం వివరంగా ఉత్తరమయినా రాయకండా తిన్నగా వాళ్ళ వూరునుంచే బొంబాయి ప్రయాణమయి వెళ్ళటమనేది సుందరామయ్యగారు అవమానంగా భావించారు.

అయినా, ఆడపిల్లలు గలవాళ్ళకోపం ఎంతసేపుంటుంది? ఇట్టే చల్లారిపోయింది సుందరరామయ్యగారి కోపం. తనే ముందుగా వ్రాశారు అల్లుడిపేర. మామయ్య వ్రాసిన ఉత్తరానికి జవాబుగా ఏదో గాలికి పోస్టు చేశాడు నిర్లక్ష్యంగా. మూర్తికి బొంబాయి వచ్చాక అతనిలో అన్ని విధాలా మార్పులు కలిగాయి. రోజులు సెకండ్లలాగా గడిచిపోతున్నాయి...

అల్లుడిఉత్తరం చూసుకున్నారు సుందర్రామయ్యగారు తనకివచ్చే జీతం రెండొందలని బొంబాయి వంటి మహానగరంలో అస్వల్ప జీతంతో గడపటం బ్రతకలేక బ్రతకటమే...అని...ఇంకా ఏమేమో

వ్రాశాడు మూర్తి. కాంతంగురించి ఒక్క ముక్క యినా వ్రాయలేదు. నడుంవిరిగినట్టుగా ఫీలయ్యారు సుందర్రామయ్యగారు. తనేమంత సంపన్న గృహస్థుడుకాడు. ఇంకా ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయాలి. కొడుకు చిన్నవాడాయె. చేస్తున్నదీ కలక్టరాఫీసుద్యోగం. ఆయన ఏంతోచక, వెంటనే చెల్లెలిపేర ఉత్తరం వ్రాశారు కాంతాన్ని తీసుకు వస్తానని. కామాక్షమ్మగారు అవశ్యం అలాగే చేయమని భర్తచేత వ్రాయించింది అన్నగారికి అతి మర్యాదగా. సుందర్రామయ్యగారు కాంతాన్ని అత్తవారింటికి దిగబెట్టారు అత్తవారింటి కొచ్చాక కాంతానికి ఒక్కక్షణంకూడా తీరిక ఉండేది కాదు. మూర్తి గురించి ఆమెకు ఆలోచించటానికి అవకాశమే దొరికేది కాదు. కామాక్షమ్మగారు పనిపాటల్లో ఆరితేరిన మనిషి కాంతం ఇంటిపనులు అంత చక్కగా నిర్వహిస్తోందంటే అది కేవలమూ కామాక్షమ్మగారి నేర్పరితనమనేచెప్పాలి.అత్తయ్య దగ్గర కాంతం డిసిప్లిన్‌లో డిప్లొమాపుచ్చుకుంది

ఆ వేళ ఎంచేతనో కాంతానికి, భర్తకి ఉత్తరం వ్రాయాలని సంకల్పం కలిగింది. కాంతం ఉత్తరం వ్రాయటం పూర్తిచేసేసింది. ఎంతో జాలిగొల్పుతూ వ్రాసింది. కాని ఉత్తరానికి జవాబు రాలేదు మూర్తిదగ్గరనుంచి. కాని కాంతం నిరాశ చెంద లేదు. అలా ఉత్తరాలు రాస్తూనే వుంది.

ఆవేళ జవాబు తప్పకుండా వస్తుందని ఎందుకో కాంతానికి నమ్మకం కల్గింది. అమాయకుల కోరికలు ఫలిస్తాయంటారు! అందుకనే గాబోలు పోస్టుమాన్ ఆరోజు ఆలస్యంగా వచ్చినా కాంతానికి ఒక కవరిచ్చి వెళ్ళిపోయాడు. తనపేర మొదటసారిగా, కేరాఫ్ మామగారి ఎడ్రస్, కాంతానికి జవాబు వచ్చింది. కవరు వెనక్కాల మూర్తి, బొంబాయి అని వ్రాసివుంది. కాంతం ఆనందానికి మేరలేదు. తొందరగా కవరు విప్పి చదవసాగింది. అంతా కవితా ధోరణిలో సాగిపోయింది.ఉత్తరం...సారాంశం "తనకు సెలవు దొరకదనీ, బొంబాయిలో అసలు ఇళ్ళంటూ దొరకవనీ, కాపరం పెట్టడం ఇప్పట్లో వీలుపడ దనీ, ఒక్క సంవత్సరం ఓపికపట్టమనీ!"

"ఇంకా ఒక సంవత్సరమా!"కాంతం నిరాశతో కృంగిపోయింది. ఆమెలోని అసహాయత మూర్తిపై కోపాన్ని రేకెత్తించింది. ఆమెలో ఎక్కడలేని ధైర్యం వచ్చింది! లెటర్ హెడ్ తీసుకుని వ్రాయ సాగింది. మూర్తికి చాలా ఘాటుగా వ్రాసింది జవాబు. నెల్లాళ్ళలో వచ్చి తీసుకెళ్ళి కాపురం పెట్టకపోతే తనే స్వయంగా, ఎవరికీ తెలియ కండా, చక్కా బయలుదేరి వస్తానని వ్రాసింది. ఇలా వ్రాసినందుకు ఆమె ధైర్యానికి ఆమెకే ఆశ్చర్యం కలిగింది.

స్టేట్స్ రీ ఆర్గనైజేషన్ రిపోర్టు గురించి తీవ్రంగా వాగ్యుద్ధం జరుగుతోంది ఆ హోటల్లో బసచేస్తున్న ప్రవాసాంధ్రుల మధ్య. అందరిలో మూర్తి కంఠం బాగా వినిపిస్తోంది. ఆ రోజు శనివారం, ఒక్కపూట ఆఫీసు గనుక, అంతా రెండున్నరకే ఆఫీసుల్నుంచి హోటల్ చేరు కున్నారు. ఆగదిలో వుంటున్న వాళ్ళంతా తెలుగు వాళ్లే అది దాదరులో ఒక దక్షిణాది హోటలు '...అందుకే' మూర్తికి కాలం ఇట్టే గడిచి పోతోంది మిత్రులతో. వాసు, రామం, రావ్ ఒకపక్షం, మూర్తి, రెడ్డి ఒక పక్షం చర్చ చాలా తీవ్రంగా జరుగుతోంది. ఇంతలో హోటల్ ఫ్యూన్ ఆరోజు వచ్చిన ఉత్తరాలిచ్చి పోయాడు. ఉత్తరాలొచ్చిన వాళ్ళంతా చదువుకోటంలో నిమగ్నులయారు. అందులోనే, కాంతం మూర్తికి ఘాటుగా వ్రాసిన ఉత్తరంకూడా వుంది.

అంతా ఉత్తరాలు చదువుకోటం ముగించి తిరిగి చర్చ ప్రారంభించారు. కాని లీడర్ ఆఫ్ ది అపోజిషన్ క్వశ్చన్ మార్కులాగా మొహంపెట్టి మాట్లాడకండా కూర్చున్నాడు.

'యేగా బ్రదర్! ఏమిటి విశేషం?' ప్రశ్నించాడు వాసు. మూర్తి భార్య కాంతం వ్రాసిన 'అల్టిమేటం' చదివి వినిపించాడు మిత్రులకి.

"రివల్యూషన్!" ఎగిరి గంతేశాడు రామం.

"అదొకటే సొల్యూషన్!" అని శృతికలిపాడు వాసు.

"అయితే. ఏం చెయ్యదల్చుకున్నావురా!..." అన్నాడు రామం తిరిగీ...

"...?..." అదే పోజుపెట్టాడు మూర్తి.

"అఁ! నే చెప్పినట్టు చెయ్యరా మూర్తీ! మీ ఆవిడకి ప్రాధేయ పూర్వకంగా జవాబు వ్రాయరా. ఆడవాళ్ళ మనస్సు ఇట్టేకరిగి నీరయి పోతుంది."

అన్నాడు వాసు, మనస్తత్వ శాస్త్రం బాగా తెల్సిన వాడిలా.

"అది కాదురా! ఏ కళ్యాణ్ లోనో ఇల్లు సంపాయించి, సంసారం పెట్టేయరా!" అన్నాడు రామం ప్రాబ్లెమ్ సాల్వు చేసినట్టుగా.

"పోరా! ఇప్పట్నుంచే సంసారం! పెళ్ళాం పిల్లలు అబ్బబ్బ!" అని చీదరించుకున్నాడు మూర్తి.

"మా నాయనే! మరయితే ఎందుకు పెళ్ళా డేవు?" వెక్కిరించాడు రామం.

"ఉండరా! నువ్వు వాడసలే బాధ పడ్తోంటే నీ వెధవ సజెషన్స్‌నూ" అన్నాడు వాసు సానుభూతిగా.

అంతా పాలిటిక్స్ మర్చిపోయి ఈ చర్చలో పడ్డారు.

"అసలింతకీ ఈ వుత్తరం మీ ఆవిడ వ్రాసింది కాదేమో!..." అన్నాడు. ఎడ్గర్ వాలెస్ నిజీక్షించుకున్న రెడ్డి పెద్దడిటక్టివ్ పోజులో. మూర్తి ఆలోచనలో పడ్డాడు. కాంతం ఇలా వ్రాసిందని పెద్ద వాళ్ళకి వ్రాస్తే తనకే ముప్పు వస్తుంది. తన చేతకానితనం బయట పడుతుంది. పోనీ ఏమీ రాయకుండా వూరుకుంటే నిజంగా కాంతం బయల్దేరి రావచ్చు.... ఒక్కక్షణం క్రితం మిత్రులతో హాయిగా కాలం గడుపుతూ స్వతంత్రగా జీవిస్తున్న తను ఇకముందు సంసారసాగరంలో మునిగిపోవాలి. ఇదేమంత నచ్చలేదు. మూర్తికి; "అయినా కొన్నాళ్ళక్కడ కాంతాన్ని వుంచి తిరిగి పంపేస్తే" అని అనుకున్నాడు. 'ఐడియా' ఒక్కసారి ఎగిరి గంతేశాడు రామం. "ఒరేయ్ మూర్తీ! శెలవుపెట్టి వెళ్ళి మీ ఆవిడను తీసుకొచ్చేసెయ్. కళ్యాణ్ లో మన ఆఫీసులో పనిచేస్తున్న సాంబమూర్తి గారుంటున్నారు. ఆయన ఇల్లు ఖాళీగావుంది. ఈ మధ్యనే ఫామిలీ పంపించేశాడు. కొన్నాళ్లుండొచ్చు. తరువాత చూసుకోవచ్చు." రామం ఈమాట ప్రాబ్లెమ్ పూర్తిగా అన్సర్ చేసేశాడు

మూర్తి రామం సలహా పాటించాడు. సెలవుకి దరఖాస్తు పెట్టాడు. ఆఫీసులో ఆఫీసరు ఏ కళ వున్నాడోగాని సెలవు గ్రాంటు చేశాడు. సాంబమూర్తిగారుకూడా తప్పకండా ఉండమన్నారు. వాళ్లింట్లో ఇంకేం! మద్రాస్ మెయిల్...మూర్తిని గృహోన్ముఖుల్ని చేసింది.

మూర్తి ఇచ్చిన వైరు కాంతం సంతోషాన్ని హిమాలయపర్వతాగ్రాలకి తీసుకుపోయింది. మూర్తి వస్తూనే కోపం నటిస్తూ కాంతానికి దూరంగా సంచరించటం మొదలెట్టాడు. కాంతానికి తెలుసు మూర్తి కోపానికి కారణం. కామాక్షమ్మగారు కొడుకు వచ్చాడన్న సంతోషంలో పిండివంటలు వంటింట్లో స్పెషలయిజ్ చేస్తున్నారు. ప్లీడరుగారు కొడుకింత సడెన్‌గా రావటంలో అంతరార్థం గ్రహించలేకపోయారు. కానీ ఆయన అంతలోనే మర్చిపోయారు.

భోజనాలయాక ప్రయాణ బడలికచేత పడుకున్నాడు మూర్తి. మూర్తి లేచేసరికి సాయంత్రం నాలుగ్గంట లయింది. ఎదురుగా టేబిల్ మీద మైసూర్ పాక్, ఉప్మా ఆహ్వానిస్తున్నాయి. అన్నీ ఇట్టే ఖాళీ చేసేశాడు మూర్తి. దాహం వేస్తోంది.

"మంచినీళ్ళివ్వనా"...కాంతం అడిగింది.

వెనక్కి తిరిగిచూశాడు మూర్తి..."కాంతం" తనకళ్ళని తనే నమ్మలేకపోయాడు. పెళ్ళయాక అంతదగ్గిరగా చూడటం అదే మొదటిసారి. తన భార్య...! ఆ సౌందర్యమూర్తి!...అలా మూర్తి చూస్తోంటే కాంతం సిగ్గుపడి లోపలికెళ్ళిపోయింది. తిరిగి మంచినీళ్ళు, కాఫీ పట్టుకు ప్రవేశించింది.

"కాంతం! నీ ఉత్తరం నన్నెంత కలవర పెట్టిందో తెలుసా?..." అన్నాడు మూర్తి నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

"అలా వ్రాయకపోతే మీరు వచ్చేవారు కాదన్నమాట!" అడిగింది కాంతం

"అదికాదు కాంతం!" అని ఏమో చెప్పబోయాడు.

"ఏదికాదు! మీకెన్ని ఉత్తరాలువ్రాసి జవాబు వ్రాశారా?" కాంతం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

మూర్తి హృదయంలో ఆటంబాంబు పేలింది. మొదటిసారిగా ప్రేమ పెల్లుబికింది.

"జరిగినదంతా మర్చిపో కాంతం! ఈమారు నేనొక్కడ్నే కాదు బొంబాయి ప్రయాణం!" అని చెప్పబోయాడు ఇంకా యేమిటో.

"నిజంగానే?" కాంతం కలవరపడింది.

"ఆ! నిజంగానే కాంతం. ఎల్లుండి ప్రయాణం!" అన్నాడు. కాంతం మూర్తివడిలో వాలిపోయింది. మూర్తి కాంతాన్ని దగ్గరగా తీసుకున్నాడు. ★